# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **చిత్తూరుజిల్లాలో స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్ట్‌కు స్కోచ్ గోల్డెన్ అవార్డు లభించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.**

2. **తిరుపతిలోని ఆకాశవాణి కార్యాలయాన్ని ప్రసార భారతి బోర్డు ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ ఈరోజు పరిశీలించారు.**

3. **జిఎస్టీని సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

4. **ప్రముఖ కవి, రచయిత గురజాడ అప్పారావు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

చిత్తూరుజిల్లాలో స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్ట్‌కు స్కోచ్ గోల్డెన్ అవార్డు లభించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈమేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈరోజు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా పదహారు వందల కుటుంబాలు సౌరశక్తిని వినియోగిస్తుండగా, ప్రతి సంవత్సరం 4.89 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతోందని వెల్లడించారు. ఫలితంగా కర్బన ఉద్గారాలను తగ్గించగలిగారని వివరించారు. హరిత స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ఈ ప్రాజెక్ట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

--------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన "చలో జీతే హై" లఘు చిత్రాన్ని పలు థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభమై ఈ నెల 24 వరకు ప్రదర్శించనున్న ఈ లఘు చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ చిత్రాన్ని వీక్షించిన విశాఖపట్నానికి చెందిన ప్రేక్షకురాలు ఆకాశవాణితో మాట్లాడుతూ..

..వాయిస్..20 సెకన్లు

--------------------------

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని నోవాటెల్‌లో వెస్టిన్ కాలేజ్ ఆధ్వర్యంలో కాఫీ అండ్ కన్వర్జేషన్ సిరీస్ కార్యక్రమం గత రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని పేర్కొన్నారు. 15 ఏళ్ల పాటు కూటమి పార్టీలు కలిసి ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

తిరుపతిలోని ఆకాశవాణి కార్యాలయాన్ని ప్రసార భారతి బోర్డు ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి కార్యాలయంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.అనంతరం స్టేషన్ లోని కంట్రోల్ రూం, స్టూడియోను పరిశీలించి, ఆకాశవాణిలో శ్రోతలకు అందిస్తున్న ప్రసారాల వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 20 సెకన్లు

---------------------------

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బలిజేపల్లిలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిన్న నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవలసిన ఆహారంపై అవగాహన కల్పిస్తూ, రక్తహీనత నివారణకు అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోవడం పట్ల పార్వతీపురం మన్యం జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేపటి నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులు అమలులోకి రానుండడంతో ప్రజలు, రైతులు జీఎస్టీ కౌన్సిల్‌కి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలానికి చెందిన జి. రాహుల్ ఆకాశవాణితో మాట్లాడుతూ…

…వాయిస్..20 సెకన్లు

---------------------------

దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని జాతీయ సమగ్రత గురించి తెలిపిన నవయుగ వైతాళికుడు ప్రముఖ సంఘసంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు జయంతి ఈరోజు. 1862 సెప్టెంబర్ 21 జన్మించిన ఆయన తన రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు. కన్యాశుల్కం, ముత్యాలసరాలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, వంటి రచనల ద్వారా సాంఘిక దురాచారాలపై సమాజాన్ని జాగృతం చేసిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు. 19, 20వ శతాబ్దాలలో ప్రజలందరికీ అర్థమయ్యే భాషలో ఆయన చేసిన రచనలు.. ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. ఆయన రచించిన "కన్యాశుల్కం" నాటకం సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది.

గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులు అర్పించారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

...వాయిస్ ... 1.40 సెకన్లు

---------------------------

ఆసియా కప్ సిరీస్‌లో భాగంగా సూపర్4లో భారత్, పాకిస్థాన్ ఈరోజు తలపడనున్నాయి. దుబాయ్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగనుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

---------------------------

మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర ఆంధ్రా కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

======================